క్లుప్తంగా

వాహనాల మరమ్మతులకు ప్రత్యేక విధానం

● కార్పొరేషన్ కమిషనర్ నల్లనయ్య



పాడైన వాహనాలను పరిశీలిస్తున్న కమిషనర్ నల్లనయ్య

విజయనగరం: పారిశుధ్య నిర్వహణకు వినియోగిస్తున్న వాహనాల మరమ్మతులకు ప్రత్యేక విధానాన్ని రూపొందించనున్నామని విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య అన్నారు. నగరంలోని మేదరవీధి ప్రాంతంలో ఉన్న వెహికల్ డిపోను డీఈ శ్రీనివాసరావు, తదితరులతో కలిసి శనివారం పరిశీలించారు. డిపోలో పాడైన వాహనాలు ఎక్కువగా ఉండడానికి గమనించి వాటిని వినియోగంలోకి తీసుకువచ్చేందుకు ప్రత్యేకమైన మెకానిక్‌ను ఏర్పాటు చేసి, వెల్డింగ్ మిషన్, ఇతర యంత్రాలు సమకూర్చాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. అలాగే వివిధ ప్రాంతాలలో పర్యటిస్తూ పారిశుధ్య నిర్వహణ ఏ విధంగా ఉందో గమనించారు. కొన్నిచోట్ల రహదారులు ఆక్రమించి బడ్డీలు ఏర్పాటు చేయడాన్ని చేసి వాటిని వెంటనే తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో పారిశుధ్య పర్యవేక్షకుడు బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తలు పాటిస్తే టీబీ దూరం



అవగాహన కల్పిస్తున్న టీబీ కంట్రోల్ సూపర్ వైజర్ లలిత

చీపురుపల్లి: ముందస్తు జాగ్రత్తలు పాటించడం వల్ల టీబీ వ్యాధికి దూరంగా ఉండవచ్చని టీబీ కంట్రోల్ సూపర్‌వైజర్ జి.లలిత చెప్పారు. టీబీ నివారణపై మండలంలోని పర్ల గ్రామస్తులకు శనివారం అవగాహన కల్పించారు. ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో టీబీ నివారణపై వంద రోజుల అవగాహన కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వ్యాధికి సంబంధించి ఎక్స్‌రే, టీబీ పరీక్షలు ఆరోగ్య కేంద్రాల్లో ఉచితంగా నిర్వహిస్తామని చెప్పారు. టీబీ వ్యాధి సోకకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నట్లు వెల్లడించారు. టీబీ వ్యాధిగ్రస్తులకు ప్రతినెలా రూ.వెయ్యి చొప్పున ప్రభుత్వం అందజేస్తున్నట్టు తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు



రైతులకు సూచనలిస్తున్న ప్రకృతి వ్యవసాయ అధికారి హేమసుందర్

బొండపల్లి: ప్రకృతి వ్యవసాయం చేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని ప్రకృతి వ్యవసాయం రీజనల్ అధికారి జి.హేమసుందర్ అన్నారు. మండలంలోని కొత్తపాలెంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా అపరాల పంటల సాగుపై శనివారం అవగాహన కల్పించారు. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు, ఆరోగ్యవంతమైన పంట కావాలంటే ప్రకృతి సాగు బాట పట్టాలని ఆయన తెలిపారు.

పరామర్శ



ముత్యాలమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

వేపాడ: మండలంలోని చినగుడిపాల గ్రామ సర్పంచ్ బోజంకి రామునాయుడు తల్లి ముత్యాలమ్మ ఇటీవల మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, డీసీసీబీ మాజీ చైర్మన్ చినరామునాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు ముమ్మలూరి జగ్గుబాబు తదితరులు బాధిత కుటుంబ సభ్యులను శనివారం కలిసి పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని భరోసానిచ్చారు. అనంతరం ముత్యాలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎల్.కోట ఎంపీపీ జి.శ్రీనివాసరావు, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు నిరుజోగి వెంకటరావు పాల్గొన్నారు.

219 మందికి వైద్యసేవలు



వృద్ధుడికి మందులు అందజేస్తున్న దృశ్యం

కొత్తవలస: మండలంలోని కంటకాపల్లి గ్రామంలో శారద మెటల్స్ అండ్ ఎల్లోయిస్ కర్మాగారం ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరానికి హాజరైన 219 మందికి వైద్యులు సేవలందించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు అప్పలరమణ తదితరులు పాల్గొన్నారు.

జనన, మరణ నివేదికే కీలకం..

● ఆస్పత్రుల నుంచి సకాలంలో నమోదు కాని సమాచారం
● ధృవీకరణ పత్రాల కోసం తప్పని ఇబ్బందులు



విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం

విజయనగరం: ప్రస్తుతం జనన, మరణ ధ్రువీకరణ పత్రాల అవసరం ప్రతి ఒక్కరికీ ఉంటుంది. పుట్టిన పిల్లలకు తప్పనిసరిగా జనన, మరణించిన వారి పేరుమీద వారి కుటుంబ సభ్యులు మరణ ధ్రువీకరణ పత్రం పొందాలి. పిల్లలు పాఠశాలలకు వెళ్లాలంటే ఆధార్ కార్డు, పుట్టిన సర్టిఫికెట్ లేనిదే చేర్చుకోవడం లేదు. ఈ విషయం తెలిసినా కొన్ని ప్రైవేట్ ఆస్పత్రులు అలసత్వం వీడడం లేదు. జనన, మరణ నివేదికలు ఎప్పటికప్పుడూ మున్సిపాలిటీలు, నగరపాలక సంస్థలకు అందించాల్సి ఉండగా కొందరు మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. జిల్లా కేంద్రంలో జిల్లా కేంద్రాస్పత్రి, ఘోషా ఆస్పత్రితో పాటు ప్రైవేట్ నర్సింగ్ హోమ్‌లు, మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రులు అధికంగా ఉన్నాయి. నగరంలో సుమారు 100 ప్రైవేట్ ఆస్పత్రులుండగా ఇందులో 20 సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులున్నాయి. ఈ ఆస్పత్రులన్నీ క్రమం తప్పకుండా ఆన్‌లైన్‌లో జనన, మరణ వివరాలను నమోదు చేయాల్సి ఉంటుంది. పలు ఆస్పత్రుల యాజమాన్యాలు అయితే వారి దగ్గర ప్రసవాలు చేయించుకున్న వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆన్‌లైన్‌లో వివరాలను నమోదు చేస్తున్నారు. కొన్ని ఆస్పత్రుల్లో ఎక్కువగా చనిపోయిన కేసులు ఉంటాయి. వీరికి సంబంధించిన వివరాలను మున్సిపాలిటీలకు పంపించాల్సి ఉండగా... నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

చర్యలు తీసుకుంటాం

ప్రైవేట్ ఆస్పత్రులు కచ్చితంగా నిబంధనలు పాటించాలి. జనన, మరణాలకు సంబంధించి నిర్ణీత సమయంలో వివరాలను ఆన్‌లైన్/ ఆఫ్‌లైన్‌లో ఉంచాలి. నిర్లక్ష్యం వహించే ఆస్పత్రుల వివరాలను సేకరించి ఎన్‌ఓసీ నిలిపివేస్తాం. అలాగే నోటీసులు జారీ చేస్తాం.

– పి.నల్లనయ్య, కమిషనర్, విజయనగరం కార్పొరేషన్

ఐదు రోజుల్లో వివరాలు చేరాల్సిందే..

ప్రతీ జననం, మరణం వివరాలను నివేదిక రూపంలో నేరుగా కాని, ఆన్‌లైన్‌లో కాని ఐదు రోజుల్లో కార్పొరేషన్‌కు చేరాల్సిందే. ఆ తర్వాత తీసుకొచ్చి ఇస్తే ఆస్పత్రి యజమాన్యం కమిషనర్‌కు వివరణ ఇవ్వాల్సి ఉంటుంది. పుట్టిన, మరణించిన వివరాలను సరైన విధంగా ఆన్‌లైన్‌లో నమోదు చేస్తే ఆ వివరాలను మున్సిపల్ శాఖ వెబ్‌సైట్‌లో ఉంటుంది. దాని ఆధారంగానే సచివాలయాలు, మీసేవా కేంద్రాలలో దరఖాస్తు చేస్తే నిర్ణీత గడువులోగా సర్టిఫికెట్లు అందుకునే వీలుంటుంది.

ఆన్‌లైన్‌లో నమోదు కాకుంటే కష్టాలే..

- పుట్టిన పిల్లలకు నెల రోజుల వ్యవధిలో ఆస్పత్రి నుంచి వివరాలు అందాయే లేదో మున్సిపాలిటీలో పరిశీలించుకుంటే సమస్యలే ఉండవు.
- తల్లిదండ్రుల పేర్లతో ఆన్‌లైన్‌లో వివరాలుంటే అవసరమున్న సమయంలో జనన ధ్రువీకరణ పత్రాలు తీసుకోవచ్చు.
- సంవత్సరంలోపు అయితే ఆస్పత్రి నుంచి తీసుకొచ్చిన నివేదిక, నోటరీతో దరఖాస్తు చేయాల్సి ఉంటుంది.
- సంవత్సరం దాటితే వివరాలు లేవని దరఖాస్తు చేయాలి.
- ఆర్డీఓ ద్వారా తీసుకోవడానికి తహసీల్దార్‌కు అర్జీ చేసుకోవాలి. దీనికి ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగుల సంతకాలు, గుర్తింపు కార్డులు, నోటరీలతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలి.
- విచారణ చేపట్టి, ధ్రువీకరణ వచ్చేంత వరకు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిందే. దీనికోసం నెల రోజులకు పైగా సమయం పడుతుంది.

ఆస్పత్రులకు ప్రత్యేకంగా లాగిన్లు..

2022 ఏప్రిల్ నుంచి ఆస్పత్రులకు ప్రభుత్వం ప్రత్యేక లాగిన్‌లు కేటాయించింది. పుట్టిన పిల్లలకు, చనిపోయిన వారి బంధువులకి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు ఆస్పత్రుల నుంచే లాగిన్‌లో నమోదు చేసే అవకాశం కల్పించారు. అయితే విజయనగరంలో పలు ఆస్పత్రుల యాజమాన్యాలు ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి. దీంతో ధ్రువీకరణ పత్రాల కోసం ఆస్పత్రుల చుట్టూ తిరగాల్సి వస్తోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



భోగాపురం మండల కేంద్రంలో గురు భవానీలు శీల జోగరావు, కొమ్మూరు రామకృష్ణ ఆధ్వర్యంలో శనివారం రాత్రి కలశజ్యోతులతో ర్యాలీ నిర్వహించారు. భవానీమాలధారులు అధిక సంఖ్యలో పాల్గొని జై భవానీ, జైజై భవానీ అంటూ నినాదాలు చేయడంతో ఆ ప్రాంతంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

- భోగాపురం

సీతంలో ఎనర్జీ కన్వర్షన్ డే



గాజులరేగ సీతం ఇంజినీరింగ్ కళాశాలలో ఎలక్ట్రికల్ విభాగం ఆధ్వర్యంలో ఎనర్జీ కన్వర్షన్ డే కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణ రావు, ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీ రామమూర్తి, ఈఈఈ విభాగాధిపతి, డీన్ డాక్టర్ వై.నాగేంద్రకుమార్, కళాశాల ఎనర్జీ క్లబ్ కో ఆర్డినేటర్ టి.వెంకటేష్, వివిధ విభాగాల అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

- విజయనగరం అర్బన్

డయాలసిస్ రోగులకు ఝలక్..

● 108 అంబులెన్స్ సేవలు నిలిపివేయడంతో అవస్థలు పడుతున్న రోగులు
● రవాణా కోసం వేలాది రుపాయలు ఖర్చు చేస్తున్న రోగులు
● నాలుగేళ్లలో 15,009 మందికి సేవలు
● ప్రైవేట్ వాహనాల ద్వారా డయాలసిస్ సెంటర్‌కు వస్తున్న వైనం



విజయనగరం ఫోర్ట్: పై ఫోటోలో కనిపిస్తున్న మహిళ పేరు జన్ని రమణమ్మ. సాలురు మండలం గంగందరవలస గ్రామం. విజయనగరం డయాలసిస్ సెంటర్‌లో డయాలసిస్ చేయించుకుని ఆటోలో తిరిగి గంగందరవలస వెళ్తున్నారు. విజయనగరం సర్వజన ఆస్పత్రి ఆవరణలో ఉన్న డయాలసిస్ సెంటర్‌కు ఆటోపై వచ్చి తిరిగి గ్రామానికి వెళ్లేందుకు ఆటో డ్రైవర్‌కు రూ. 2500 ఇచ్చారు.



● పక్క ఫోటోలో కనిపిస్తున్న మహిళ పేరు ఉప్పు రమణమ్మ. ఈమెది జి. సిగడాం మండలం పాలఖండ్యాం గ్రామం. ఈమె తనభర్త ఉప్పు అప్పలనాయుడుకు డయాలసిస్ చేయించడానికి బస్సుపై వచ్చారు. డయాలసిస్ చేయించుకుని ఇంటికి వెళ్లడానికి వారికి బస్సులు, భోజనం, ఇతర ఖర్చులకు రూ.500 వరకు ఖర్చు అయింది.



డయాలసిస్ సెంటర్

వీరిద్దరే కాదు.. అనేక మంది రోగులు డయాలసిస్ సెంటర్‌కు రావడానికి ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా సుదూర ప్రాంతాల నుంచి వచ్చే రోగులకు అవస్థలు తప్పడం లేదు. డయాలసిస్ రోగుల అవస్థలను చూసి గత ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి వారికి కూడా 108 సేవలను అందుబాటులోకి తీసుకొచ్చారు. డయాలసిస్ చేయించుకోవాలనుకునే రోగులు 108కు ఫోన్ చేస్తే వారి ఇంటికి వెళ్లి రోగిని ఎక్కించుకుని డయాలసిస్ సెంటర్‌కు తీసుకెళ్లేవారు. అయితే కూటమి సర్కారు వచ్చిన తర్వాత డయాలసిస్ రోగులకు 108 సేవలను నిలిపివేసింది. దీంతో డయాలసిస్ రోగులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. 2020 నుంచి జిల్లాలో డయాలసిస్ రోగులకు 108 అంబులెన్స్ సేవలు అందుబాటులోకి తీసుకొచ్చారు. అప్పటి నుంచి వేలాది మంది కిడ్నీ రోగులను అంబులెన్స్ సేవలు వినియోగించుకున్నారు.

15,009 మందికి..

2020 డిసెంబర్ నుంచి 2024 జనవరి వరకు 15,009 మంది కిడ్నీ, డయాలసిస్ రోగులు 108 వాహన సేవలు వినియోగించుకున్నారు. కాని ప్రస్తుత పరిస్థితి అందుకు భిన్నంగా ఉండడంతో రోగులకు ఇక్కట్లు తప్పడం లేదు.

సేవలు నిలిపివేశాం..

డయాలసిస్ రోగులకు 108 సేవలు నిలిపివేశాం. డయాలసిస్ రోగులను తరలించే సమయంలో అత్యవసర కేసులు వస్తే వాటికి అటెండెంట్ కాలేకపోతున్నాం.

– నజీర్ హుస్సేన్, 108 జిల్లా మేనేజర్

పశుపోషణ భారం

● యంత్రాల వినియోగంతో ఎండుగడ్డి కొరత
● విపరీతంగా పెరుగుతున్న దాణా ఖర్చులు
● మరోవైపు జీవాలను వేధిస్తోన్న వ్యాధులు
● తగ్గుతున్న పాల దిగుబడి
● ఆందోళనలో పాడిరైతులు



దాణా రేట్లు ఇలా..

దాణా రకం	ధర
తవుడు(50 కిలోలు):	రూ.1400
నూకలు(పెద్దవి 50 కిలోలు):	రూ.1200
నూకలు(చిన్నవి 50 కిలోలు):	రూ.1100
బఠాణీ బొత్తు(20 కిలోలు ఎ–1రకం):	రూ.1200
బఠాణీ పిండి(50 కిలోలు):	రూ.1500
మినప పొట్టు(50 కిలోలు):	రూ.1250
పెసరపొట్టు(50 కిలోలు):	రూ.1200
ట్రాక్టరు వరిగడ్డి(గతంలో):	రూ.5500



ఇలా యంత్రాలతో వరికోతలు చేపడుతుండడంతో గడ్డి దొరకని పరిస్థితి..

రాజాం సిటీ: పాడిరైతుకు పశుపోషణ భారమైంది. వ్యవసాయంలో యాంత్రీకరణ(యంత్రాల వినియోగం) కారణంగా ఎండుగడ్డి అంతగా దొరకని పరిస్థితి ఏర్పడింది. దీంతో పాటు విపరీతంగా పెరిగిన దాణా ఖర్చులు ఓ వైపు.. జీవాలను నిత్యం వేధించే రకరకాల వ్యాధులు మరోవైపు.. పశుపోషకులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. పశుగ్రాసం కొరతతో జీవాలు బక్కచిక్కిపోయి ఫలితంగా పాల దిగుబడి తగ్గిపోతోందని పాడిరైతులంతా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంటే ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో పశువులు పెంచేందుకు ఎవరూ అంతగా ఆసక్తి కనబరచడం లేదు. రాజాం పట్టణంతో పాటు నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లోనూ వ్యవసాయంలో ఏటా యంత్రాల వినియోగం పెరుగుతుండడంతో ఎండుగడ్డి కొరత ఏర్పడుతోంది. ఎక్కడో ఓ చోట దొరికే కాస్త ఎండుగడ్డికి మంచి డిమాండ్ ఏర్పడుతుండడంతో కొంతమంది పశు యజమానులు గడ్డిని కూడా కొనుగోలు చేయలేని దుస్థితి తలెత్తుతోంది. ఓ వైపు దాణా ఖర్చులు, మరోవైపు ఎండుగడ్డి ఖర్చు భారంగా మారడంతో పశుపోషణ ఎలా అని పాడిరైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం దాణా ఖర్చుల భారమైనా లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అభ్యర్థిస్తున్నారు.

రాజాం నియోజకవర్గంలో పాడి పశువులు ఇలా..

మండలం	పాడి పశువులు (ఆవులు, గేదెలు)
రాజాం	7800
రేగిడి	8200
వంగర	8600
సంతకవిటి	7400

ఇష్టారాజ్యంగా ధరలు..

పాడి పరిశ్రమపై ఆధారపడి జీవనం సాగిస్తున్న వారు నానాపాట్లు పడాల్సి వస్తోంది. రైతులంతా పశువుల కోసం ఎండుగడ్డితో పాటు తవుడు, నూకలు, బఠాణీ బొత్తు, పెసర బొత్తు, మినప పొట్టు తదితర వాటిని వినియోగిస్తున్నారు. వీటినే ఆసరాగా చేసుకుని వ్యాపారులు ఇష్టారాజ్యంగా వాటి ధరలు పెంచుకుంటూ పోతున్నారు. దీంతో పాడిరైతులు చేసేదేమీలేక తప్పనిసరి పరిస్థితుల్లో వారి పెంచిన ధరకే దాణా కొనుగోలు చేయాల్సి వస్తోంది. పాలసేకరణ కేంద్రాల్లో పాల ధరలు తక్కువగా ఇస్తున్నప్పటికీ దాణా మాత్రం ఎంత ఎక్కువైనా తప్పకుండా కొనుగోలు చేసి వేయాల్సి వస్తోందని, లేకపోతే ఆ వచ్చే పాలు కూడా పశువుల నుంచి సక్రమంగా రావని పాడిరైతులు వాపోతున్నారు. శీతాకాలంలో పాడి పశువులకు వేడిపుట్టి పాల దిగుబడి రావాలంటే ఇటువంటి దాణాలు వేయాల్సి వస్తోందని రైతులు చెబుతున్నారు. పశుసంవర్ధక శాఖ అధికారులు స్పందించి, ప్రభుత్వం ద్వారా దాణా సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

పాడి కలిసిరావడం లేదు..

ఒకప్పుడు కలిసొచ్చిన పాడి పరిశ్రమ ప్రస్తుతం కలిసిరావడం లేదు. ఓ పక్క మేతలు లేక.. మరోపక్క వ్యాధులు భయంతో ఇబ్బందులు పడుతున్నాం. దాణాల రేట్లు బాగా పెరిగిపోయాయి. అయినా పాలవ్యాపారంతో కుటుంబం పోషించుకోవచ్చన్న ఆశతో దాణా కొనుగోలు చేసి, వినియోగిస్తున్నాం. ఇదే అదనుగా వ్యాపారులు దాణా ధరలు పెంచేస్తున్నారు.

–శాసపు సత్తిబాబు, పాడిరైతు, పొనుగుటివలస గ్రామం

సబ్సిడీపై దాణా అందించాలి..

ప్రస్తుతం దాణా ఖర్చుల భారమవుతున్నందున ప్రభుత్వమే సబ్సిడీపై దాణా అందించాలి. అలాగే సకాలంలో పశువైద్యం అందేలా చర్యలు తీసుకోవాలి. పాల దిగుబడి పెరగాలంటే పశువులకు తగినంత పౌష్టికాహారం అందివ్వాలి. ప్రభుత్వ సహకారం ఉంటే బాగుంటుంది.

–ఎ.వెంకటేష్, పాడిరైతు, రాజాం

రెండు చోట్ల నిలిచిన నీటి సంఘ ఎన్నికలు



విజయనగరం రూరల్: ద్వారపూడి గ్రామంలో ఎన్నికల ప్రక్రియను పరిశీలిస్తున్న జేసీ సేతుమాధవన్

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సీతారామునిపేట, తంగుడుబిల్లి గ్రామాల్లో నీటి సంఘ ఎన్నికలు నిలిచిపోయాయి. మండలంలో 14 సాగునీటి సంఘాలుండగా... సారిపల్లి సంఘం తారకరామ తీర్థ సాగర్ ప్రాజెక్ట్‌లో కలిసిపోవడంతో.. మిగిలిన 13 సంఘాలకు శనివారం ఎన్నిక నిర్వహించగా.. 11 చోట్ల ఏకగ్రీవమైంది.

విజయనగరం రూరల్: మండలంలోని 13 నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించగా.. అన్నీ ఏకగ్రీవమయ్యాయి. ద్వారపూడిలో ఎన్నిక సరళిని జేసీసేతు మాధవన్ పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల వద్ద 144వ సెక్షన్ అమలు చేసినట్లు జేసీ తెలిపారు. ఆయనతో పాటు తహసీల్దార్ కూర్మనాథ్, నీటిపారుదల ఈఈ ఎం. వెంకటరమణ ఎన్నికలను పర్యవేక్షించారు.

భోగాపురం: మండలంలోని నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించారు. విజేతలను రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు అభినందించారు. మండల అధికారులు ఎన్నికల సరళిని పర్యవేక్షించారు.

పూసపాటిరేగ: మండలంలోని ఎనిమిది నీటి సంఘాలకు ఎన్నికలు జరగగా ఏడు సంఘాలు ఏకగ్రీవమయ్యాయి. అల్లాడపాలెం చానల్‌కు సంబంధించి ఎన్నిక రసవత్తరంగా జరిగింది. తహసీల్దార్ తాడ్డి గోవింద, ఎంపీడీఓ రాధిక, డీటీ రమేష్, పీఆర్ డీఈ శ్రీనివాసరావు ఎన్నికల తీరును పరిశీలించారు.

డెంకాడ: మండలంలోని 11 సాగునీటి సంఘాలలో 11 టీసీ ఎన్నికలను అధికారులు వాయిదా వేశారు. మిగిలిన చోట్ల ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా అధికారులు చర్యలు తీసుకున్నారు.